సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్‌ను బలపరచాలి

● మంత్రి దామోదర రాజనర్సింహ

బోరబండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల సక్రమ అమలుకు కాంగ్రెస్ పార్టీని బలపరచాలని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్ నగర్, నటరాజ్ నగర్, బి.శంకర్‌లాల్ నగర్, నేతాజీ నగర్ బస్తీల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి, పీజేఆర్ తనయ, కార్పొరేటర్ పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న ప్రముఖ సినీనటుడు సుమన్


ఎల్ఎన్‌నగర్‌లో అవ్వ ఆశీర్వాదం తీసుకుంటున్న నవీన్ యాదవ్


ఎస్‌పీఆర్ హిల్స్‌లో పీజేఆర్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు విజయారెడ్డి, సీఎన్ రెడ్డి


ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ


నవీన్ యాదవ్‌తో ప్రచారంలో పాల్గొన్న నాయకురాలు ఝాన్సీరెడ్డి

సినీనటుడు సుమన్ ప్రచారం

యూసుఫ్‌గూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్‌కు మద్దతుగా యూసుఫ్‌గూడ డివిజన్‌లో ప్రముఖ సినీనటుడు సుమన్, లక్ష్మీనరసింహ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఝాన్సీరెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ చిత్ర పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దన్నలాగా అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ధైర్యం ఇచ్చారని తెలిపారు. సినీ కార్మికులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి నవీన్ యాదవ్‌కు ఓటు వేయాలని కోరారు.

నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటాం..

పంజాగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటామని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ, సమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. నవీన్ యాదవ్ రౌడీ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముద్ర వేస్తూ అహంకార పూరితంగా మట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. నవీన్ యాదవ్ పిలిస్తే పలుకుతారని, ఏ ఆపద వచ్చినా ఆదుకుంటారని తెలిపారు. సమావేశంలో సమితి గౌరవ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్ యాదవ్, జి.శ్రీనివాస్ యాదవ్, నరసింహ యాదవ్, రామకృష్ణ యాదవ్, శ్రీశైలం యాదవ్, లక్ష్మీయాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాములు యాదవ్

ట్రాఫిక్‌ను గాలికొదిలేసి..

రోడ్ షోలకే పోలీసులు పరిమితం

● జూబ్లీహిల్స్ సహా.. పశ్చిమ మండలంలో విపరీతమైన ట్రాఫిక్ ● కనిపించని పోలీసులు, వాహనదారులకు ఇక్కట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకుంది. అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, బీజేపీ ఎవరికి వారు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. గల్లీ లీడర్ నుంచి ముఖ్యమంత్రి వరకు.. బస్తీ నాయకుల నుంచి యువజన సంఘాల నాయకుల వరకు ప్రచారంలో పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోటాపోటీగా రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమ మండలంలోని పలు ప్రాంతాల్లో విపరీతంగా ట్రాఫిక్‌జామ్ అయింది.

రోడ్ షోల్లోనే పోలీసులు..

రాజకీయ ప్రముఖులు రోడ్ షోలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో భద్రత, బందోబస్తులో పాల్గొంటున్న పోలీసులు రోడ్లపై ట్రాఫిక్‌ను గాలికొదిలేస్తున్నారు. ముందుగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలు, జంక్షన్ల వద్ద కనిపించకుండా పోతున్నారు. దాంతో విపరీతంగా ట్రాఫిక్‌జామ్ అయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడ, వెంగళరావునగర్‌లో, కేటీఆర్ షేక్‌పేట ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించారు. ప్రజలు భారీగా తరలొచ్చారు. ఆ ప్రభావం మిగిలిన ప్రాంతాల్లోని రోడ్లపై పడింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ సహా.. పశ్చిమ మండలంలోని అనేక ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ డైవర్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు లేకపోవడం, వాహనదారులు ఇష్టానుసారంగా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జఠిలంగా మారింది. దాంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడి నరకం అనుభవించారు. అసలే రద్దీ ఎక్కువ ప్రాంతం కావడం, పోలీసులు మచ్చుకైనా కనిపించకపోవడంతో ట్రాఫిక్ గతితప్పింది. ఈ క్రమంలో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ప్రముఖుల రోడ్ షోలు, ప్రచార కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని పశ్చిమ మండలంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డు ప్రారంభోత్సవంలో సినీనటులు అలీ, మాదాల రవి

వేగంగా పెరుగుతున్న వ్యాధులు

● సినీనటులు అలీ, మాదాల రవి

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జీవనశైలిలో వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని సినీనటులు అలీ, మాదాల రవి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని స్ప్రింట్ డయాగ్నస్టిక్స్‌లో శనివారం వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సమాజ నిర్మాణానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో డయాగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కేబీఆర్ పార్కు చుట్టూ అభివృద్ధికి వ్యతిరేకం కాదు'

పంజాగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు చుట్టూ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ప్రాజెక్ట్ ప్రణాళికలు రూపొందించే ముందు సామాజిక, పర్యావరణ ప్రభావాలను అంచనా వేయాలని కేబీఆర్ పార్కు రోడ్డు విస్తరణ ప్రభావిత యజమానుల ఫోరం ప్రతినిధులు అన్నారు. సులువైన ప్రత్యామ్నాయాలు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సవరణ చట్టం(చట్టం 21, 2017)లోని సెక్షన్ 10ఏ దుర్వినియోగం అవుతోందని వారు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం అధ్యక్షుడు వి.విద్యానాథ్ శాస్త్రి, కార్యదర్శి ఎస్.బాల్‌రెడ్డి, కోశాధికారి పి.వంశీకృష్ణ, సభ్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, వి.శ్రీధర్, తదితరులు మాట్లాడారు. కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రోడ్డు నెంబర్.92లో ఒకవైపు మాత్రమే స్థలాన్ని సేకరిస్తుడడం అన్యాయం అన్నారు. తాము రోడ్డు వెడల్పుకు వ్యతిరేకం కాదని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని అన్నారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు, పలువురు ఇంటి యజమానులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వాముల పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అయ్యప్పస్వామి నామస్మరణ ఎంతో మధురం

బేగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి నామస్మరణ ఎంతో మధురమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ భూలక్ష్మి ఆలయం నుంచి శబరిమల వరకు సాగే అయ్యప్పస్వాముల పాదయాత్రను జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆలయంలోని శ్రీ భూలక్ష్మి అమ్మవారు, సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.


ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న దీపక్‌రెడ్డి


యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ కొమరయ్య

జూబ్లీహిల్స్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి

ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తనకు ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రగడ్డ డివిజన్ నేతాజీనగర్, సుల్తాన్‌నగర్, సంజయ్‌నగర్, గౌతమ్‌పురి కాలనీ తదితర బస్తీల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, బొట్టు విజయకుమార్, గణేశ్ కుమార్, సూర సునీత పాల్గొన్నారు. దీపక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య కోరారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, నాయకులు దూళ్ల ప్రేమ్ కుమార్, కుంబాల గంగరాజు, పులిరామ్, సతీష్ పాల్గొన్నారు.


పోలీసులకు వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు

బాబా ఫసియుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలి

బోరబండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు ఎం.డి. సర్దార్ మృతికి బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కారకుడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సర్దార్ తల్లి దండ్రులతో పాటు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫసియుద్దీన్ వేధింపుల వల్ల సర్దార్ బిల్డింగ్ మూడో ఫ్లోర్ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు.

ఉక్కు మనిషికి ఘన నివాళులు

యూసుఫ్‌గూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉప ప్రధానిగానూ, హోం శాఖ మంత్రిగానూ భారతదేశ ప్రజలకు విశేష సేవలందించారని కమాండెంట్ పి.మురళీకృష్ణ గుర్తు చేశారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా ఒకటవ బెటాలియన్‌లో చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం రాకముందు ఉన్న సంస్థానాలను భారతదేశంలో విలీనం కావడానికి వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని ఆయన కొనియాడారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నరేంద్రసింగ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రాంబాబు, కేవీవీ ప్రసాద్ అప్పారేయ్, నర్సింహ, ఆర్ఐలు కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య, రమేష్‌బాబు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు ప్రత్యేక అలంకారం

అమీర్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి శనివారం ఏకాదశిని పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మను మల్లె పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శేఖర్, చైర్మన్ సాయిబాబాగౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


మల్లెపూలతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ


మాగంటి సునీతకు మట్టిపాత్రను అందజేస్తున్న నిర్వాహకుడు


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఓటు వేయకుంటే పథకాలను రద్దు చేస్తారా?: బీఆర్ఎస్

యూసుఫ్‌గూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారా? ఇదేనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చే సందేశమని ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ శనివారం ఆయన సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ డివిజన్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కులవృత్తులు కూలిపోయాయన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీనగర్‌కాలనీలో ప్రచారం చేశారు. మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. వ్యవసాయానికి కోతల్లేని కరెంట్‌ను నిరంతరం రైతన్నలకు అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమని, నేడు కరెంట్ సరఫరాలో కోతలు తప్పడం లేదని రాజ్యసభసభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. యూసుఫ్‌గూడ బస్తీలో ఆయన ప్రచారం నిర్వహించారు. షేక్‌పేట అంబేడ్కర్ నగర్, బాలాజీ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతతో కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, తెలంగాణ ప్రజల ముందు 420గా నిలిచిందని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మురళిని సీఎండీకి పరిచయం చేస్తున్న బీసీ సంఘం నేతలు

విద్యుత్ బీసీ సంఘం

ఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీగా మురళి

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమార స్వామి అధ్యక్షతన మింట్ కాంపౌండ్‌లో శనివారం టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీగా బొబ్బిలి మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయనను సీఎండీ ముషారఫ్ ఫారూఖీకి బీసీ సంఘం నేతలు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బీసీ సంఘం ఆవిర్భవించి 20 ఏళ్లు అవుతున్న సందర్భంగా 2026 బీసీ డైరీని భారీ స్థాయిలో తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్ మాట్లాడుతూ సమస్యల సాధనలో విద్యుత్ సంస్థల్లోని బీసీ ఉద్యోగులంతా కదం తొక్కాలని, 20వ రాష్ట్ర మహాసభను దిగ్విజయంగా నిర్వహిస్తామని తెలిపారు. న్నారు. పదోన్నతుల అంశాలు, ఇతర సమస్యల పరిష్కారంపై కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.


ఇండియన్ ఆర్ట్ ఫెయిర్‌లో యువ చిత్రకారులు

భళారే వి'చిత్రమ్'

● ఆర్ఎంజే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ ఆర్ట్ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమకాలీన చిత్రకళను ప్రోత్సహిస్తూ, తద్వారా సమాజంలో సానుకూల మార్పును కాంక్షిస్తున్న ఆర్ఎంజే ఫౌండేషన్ ఆధ్వర్యంలోని భారతీయ చిత్రకళా ప్రదర్శన(ఇండియన్ ఆర్ట్ ఫెయిర్) శనివారం హైటెక్ సిటీలో ప్రారంభమైంది. దేశంలోనే గుర్తింపు పొందిన 14 ఆర్ట్ గ్యాలరీల నుంచి పలు అరుదైన చిత్రాలు, శిల్పాలు, కళాకృతులు ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. ముఖ్యంగా కళ్లు తిప్పుకోలేనంత అందమైన కాన్వాస్ చిత్రాలు, లోహపు కళాకృతులు, దారుశిల్పాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సౌత్ ఏషియా, ది ఆర్ట్ ఫ్యామిలీ ఎమర్జింగ్ ఆర్టిస్ట్ అవార్డు వంటి అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న హర్ష దూరుగడ్డ, శిల్పాగుప్తా తదితర యువ చిత్రకారులు పాల్గొన్నారు. నేటి వరకు కొనసాగే ఈ చిత్రప్రదర్శనలో 60కుపైగా అపురూప చిత్రాలు, శిల్పాలు కళాభిమానుల మనసును ఆకట్టుకుంటాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రదర్శనకు ప్రవేశం ఉచితం.



అభివాదం చేస్తున్న లక్ష్మీనారాయణ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

పంజాగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ జేఏసీ చైర్మన్ పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎస్.గోవర్ధన్ ముదిరాజ్‌తో కలిసి వారు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, జీవో.98ని వెంటనే అమలు చేయాలని, ప్రాథమిక మత్స్య, పారిశ్రామిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ ముదిరాజ్, రాణి ముదిరాజ్, జేఏసీ కార్యదర్శి రామకృష్ణ ముదిరాజ్, గౌరీశంకర్, హరికాంత్, గణేశ్, కనకయ్య, జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఇందులత

ఘనంగా సైన్స్ ఫెయిర్

అమీర్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామయ్యనగర్‌లోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో శనివారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అబ్బురపరిచారు. ప్రధానంగా రోబోటిక్స్, కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్స్, వాటర్ కలుషితం, రోడ్డు ప్రమాదాల నివారణ, సేంద్రీయ వ్యవసాయం, తక్కువ నీటితో ఇంట్లోనే కూరగాయల సాగు, సోలార్ విద్యుత్, వాతావరణ కాలుష్యం తగ్గించడం, తదితర వాటిని ప్రదర్శించి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఇందులత, ప్రిన్సిపాల్ లక్ష్మీ అభినందించారు.



స్థానిక మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

మార్కండేయనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మార్కండేయనగర్‌లో స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. నల్లాల నుంచి లో ప్రెజర్‌తో తాగునీరు సరఫరా అవుతుందని మహిళలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సవ్యంగా సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం స్థానిక సమస్యలపై మహిళలతో మాట్లాడారు. జలమండలి మేనేజర్ కుశాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న వైద్యులు

జాతీయ ఐక్యత దినోత్సవం

తిరుమలగిరి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆసుపత్రిలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి వైద్యులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని కాపాడుకుందామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామక్రిష్ణ, డాక్టర్ జీవన్ సాయి, డాక్టర్ ప్రతాప్ గౌడ్, డాక్టర్ హిరిదియ, బీజేపి సీనియర్ నాయకుడు ధనంజయ చారి, క్రిష్ణా రెడ్డి, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడలు.. తప్పిన ప్రాణాపాయం

అడ్డగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షానికి అడ్డగుట్ట లోహియనగర్‌లో ఉంటున్న వృద్ధురాలు మంజుల ఇంటి గోడలు కూలిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వృద్ధురాలు ఊపిరి పీల్చుకుంది. విషయం తెలుసుకున్న కూతురు తల్లి ఇంటికి వచ్చి పరిశీలిస్తుండగా మరలా పైనుంచి పెంకులు పడడంతో కూతురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు లలిత వృద్ధురాలి ఇంటికి వచ్చి ఆమెను ఓదార్చారు. ప్రభుత్వం న్యాయం చేస్తుందని ధైర్యం చెప్పారు.



వర్షానికి కూలిపోయిన ఇంటి వద్ద రోధిస్తున్న వృద్ధురాలు



శాస్త్రినగర్ బస్తీలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న గాంధీ ఆస్పత్రి జూనియర్ వైద్యులు

బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల జాగ్రత్త అవసరం

అడ్డగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన అవసరమని, వైద్యులు సూచించిన ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ సూచించారు. శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని శాస్త్రినగర్ బస్తీలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి గాంధీ ఆస్పత్రి జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వైద్యులు సూచించిన ప్రకారం మహిళలు జాగ్రత వహించాలన్నారు.

యువతి అదృశ్యం



డి.రాజేశ్వరి

మారేడుపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ యువతి అదృశ్యమైన ఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన దామెర రాజేశ్వరి(20) తల్లి లక్ష్మితో కలిసి చిలకలగూడలో నివాసం ఉంటుంది. రాజేశ్వరికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తల్లి మారేడుపల్లిలోని ఓ హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేసింది. కాగా శుక్రవారం సాయంత్రం హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. దీంతో హాస్టల్ నిర్వాహకుల సమాచారంతో యువతి సోదరుడు మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేసుకున్నారు. సమాచారం తెలిసినవారు మారేడుపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఉరి వేసుకుని వృద్ధుడి మృతి

మారేడుపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిళ్లతో ఓ వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లి వాల్మీకినగర్‌కు చెందిన ఎల్లయ్య(77) కుటుంబ సమస్యలతో ఒత్తిళ్లకు గురి అయి శుక్రవారం అర్ధరాత్రి భార్య, ఇద్దరు పిల్లలు ఒక గదిలో నిద్రిస్తుండగా, మరో గదిలోకి వెళ్లి సీలింగ్ ఇనుపరాడుకు కోర్ పరదాతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మారేడుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ రష్మీ పెరుమాళ్

అడ్డగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి వారినుంచి 100 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని శనివారం నార్త్‌జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. అలాగే వేర్వేరు పోలీస్ స్టేషన్‌లో నేరాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబరు 7న ఓ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసిన సికింద్రాబాద్ పార్శిగుట్టకు చెందిన మంచాల జనార్ధన్ (24) సికింద్రాబాద్ కుమ్మరిగూడకు చెందిన చెరక గౌతమ్ కుమార్ (30)లను పట్టుకుని అరెస్టు చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

బేగంపేట పోలీస్‌స్టేషన్‌పరిధిలో

సెప్టెంబరు 26న ఓల్డ్ బేగంపేట్ ప్రాంతానికి చెందిన మహిళా ఉద్యోగి మెడలోని 3.7 తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయిన గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ అశోక్(27), రమణయ్య(27)లను సీసీ పుటేజీ ఆధారంగా పట్టుకున్నారు. వారి నుంచి 3.7 తులాల గొలుసును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో

సెప్టెంబరు 27న అర్ధరాత్రి ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి సెల్‌ఫోన్‌తో పాటు ఆటోతో పారిపోయిన భవానినగర్ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ పాషా(20), షహీన్‌నగర్ పహాడి షరీఫ్‌కు చెందిన సయ్యద్ జుబేర్ అలీ (20)లను అరెస్టు చేసి వారినుంచి ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలు ఉన్నాయని డీసీపీ తెలిపారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 15న ఓ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ను షేక్ జావీద్(33), షేక్ ఆరిఫ్(25)లు అపహరించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో

ఓ ఇంట్లో చోరీలకు పాల్పడి రూ.40వేల నగదు, రూ.40వేల విలువ చేసే పంచలోహ విగ్రహాలను అపహరించిన బాపూజీనగర్‌కు చెందిన జంగయ్య చందన్ (30), బాపూజీనగర్ కిందిబస్తీకి చెందిన లక్ష్మి (35)లను విచారించగా నేరం అంగీకరించారు. సెప్టెంబరు 26న బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బస్‌స్టాప్‌లో మాధవిలత బస్సుకోసం వేచి ఉండగా పది గ్రాముల బంగారు ఆభరణాలు, వాచ్, సెల్‌ఫోన్ ఐడీ కార్డులు ఉన్న బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిన నిందితుల కోసం గాలిస్తున్నారు. న్యూ బోయిన్‌పల్లిలో సీతిరంజన్ అనే వ్యక్తిని బాలనగర్‌కు చెందిన మసూద్‌ఖాన్(49) పోలీస్ ఆఫీసర్‌ను అంటూ బెదిరించి ఫోన్‌పేలో రూ.400 డబ్బులు వేయించుకుని, రూ.1600 నగదును తీసుకుని పారిపోయిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

వితంతువుల సంక్షేమానికి కృషి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్, పీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ తదితరులు

రాంగోపాల్‌పేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులకు గురవుతున్న వితంతువుల సంక్షేమం కోసం ఆర్ట్రే ఇన్స్పిరేషన్ హ్యాండ్స్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ సంస్థ ఆధ్వర్యంలో వితంతు పిల్లల చదువు కోసం 60మంది విద్యార్థులకు ఐదువేల రూపాయల చొప్పున చెక్కులను పీసీసీ చీఫ్ కోట నీలిమతో కలిసి ఆయన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఆకస్మిక, ఆత్మహత్యలతో కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబాన్ని పోషించటం ఎంతో కష్టమని ఆయన అన్నారు. అలాంటి వారిని గుర్తించి ఈ సంస్థ పిల్లలు చదువులకు ఇబ్బందులు లేకుండా ఆదుకునేందుకు ముందుకు రావటంతో ఎంతైనా అభినందనీయమన్నారు. పీసీసీ అధ్యక్షురాలు కోట నీలిమ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం ఎంతో పాటుపడుతుందన్నారు. అంతకు ముందు డాక్టర్ సుచరిత ఆధ్వర్యంలో రోగులకు ఆర్థో, కంటి, దంత జనరల్ వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఉమ కార్తీక్, వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు, త్రికాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఆత్మీయ సమ్మేళనం



గోపూజ కార్యక్రమంలో పాల్గొంటున్న కమ్మసేవాసంఘం సభ్యులు

తార్నాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస భోజన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం తార్నాక కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని మర్రి క్రిష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సమ్మేళనంలో భాగంగా సంఘం సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉసిరి పూజ, గోపూజ కార్యక్రమాన్ని జరిపారు. విద్యార్థులు ఆట, పాటలు, సాంస్కృతిక నృత్యాలతో ఉత్సాహంగా సందడి చేశారు. అనంతరం 80 ఏళ్లు పైబడిన వృద్ధులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు. పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఒక్కొక్కరికి రూ.5వేలు, వైద్య చికిత్స నిమిత్తం రూ.30 వేలు చల్ల రాజేందర్ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఏటా కమ్మ సేవా సంఘం సభ్యులందరం ఐక్యమత్యంతో కార్తీక మాస బోజన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత గోపాలకృష గోకలే విద్యా ఫౌండేషన్ ద్వారా తార్నాక కమ్మ సంఘం ప్రతిపాదించిన నలుగురు ఇంజనీరింగ్/ మెడికల్ కోర్సు చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు యలమంచిలి రాధా కృష్ణ, ఉపాధ్యక్షుడు పొట్లూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కిలారు శ్రీనివాస్ రావు, సంయుక్త కార్యదర్శి సుఖవాసి సాయి నటరాజ్, కోశాధికారి కిలారు రమేష్, గొర్రెపాటి జగదీశ్వరరావు, కావూరి నరసింహారావు, సి.ఆర్.ప్రసాద్, కుర్ర నరసింహారావు, రమేష్‌బాబు, మంట రాజేశ్వరరావు, వై. ప్రసూనా తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

నేనున్నా ధైర్యంగా ఉండండి : తలసాని

రెజిమెంటల్‌బజార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోండా డివిజన్‌లో మటన్ వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం శనివారం మోండా మార్కెట్ ప్రాంతంలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. వంద సంవత్సరాల నుంచి చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటుంటే, జీహెచ్ఎంసీ అద్దెలు పెంచి చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కొత్తగా పెంచిన అద్దెలు చెల్లించవద్దని, అవసరం అయితే మార్కెట్ బంద్ చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్కైలాబ్ యాదవ్, ఆకుల హరి కృష్ణ, నాగులు, మహేష్ యాదవ్, రాములు, ఓదెల సత్యనారాయణ, మహేందర్, చంద్రప్రకాశ్, అబ్బాస్, మటన్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు ఆయూబ్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఆలయాల్లో ఏకాదశి పూజలు

బౌద్ధనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశి పురస్కరించుకుని శనివారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శీగిరి గోదాసమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొడకండ్ల రాజేష్‌కుమార్, కమిటి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

● నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. మూల విరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని పువ్వులతో అలకరించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరా దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బౌద్ధనగర్ రామాలయం, సీతాఫల్‌మండి రామాలయం, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం తదితర ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

9న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

చిలకలగూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నవంబరు 9 ఆదివారం మల్లాపూర్, వీఎస్ఆర్ గార్డెన్‌లో కార్తీక వన భోజనాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావిస్తున్నట్లు సమాఖ్య మల్కాజిగిరి అధ్యక్షుడు మరువాడ కామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు విచ్చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం, వివిధ రంగాల్లో ప్రతిభ కబబరచిన వారికి సత్కారం, సినీ నటుడు కొండిపర్తి ప్రదీప్ ప్రత్యేక అతిథిగా విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.



నగర కీర్తనలో సిక్కులు

గురునానక్ జయంతి వేడుకలు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిక్కుల తొలి గురువు గురునానక్ దేవ్‌జీ 556వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా శనివారం గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నగర కీర్తన క్లాక్‌టవర్, ప్యాట్నీ, బాటా, మోండా మార్కెట్ మీదుగా తిరిగి గురుద్వారాకు చేరుకుంది. నగర సంకీర్తనలో భాగంగా ప్రత్యేక వాహనంలో గురుగ్రంధ్ సాహెబ్‌జీ నిషాన్ ఏర్పాటు చేశారు. సిక్కు యువత గట్కా స్కిల్స్, మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. దారి పొడవునా ప్రజలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు బల్దేవ్ సింగ్ బగ్గా, జనరల్ సెక్రటరీ జగ్‌మోహన్ సింగ్,సెక్రటరీ హర్‌ప్రీత్ సింగ్ గులాటీ పాల్గొన్నారు.

ప్రమోషన్ల అన్యాయంపై ప్రభుత్వం తీరు శోచనీయం : ఔటా



నిరసన తెలుపుతున్న ఔటా నాయకులు, అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ సీఏఎస్ ప్రమోషన్లలో అధ్యాపకులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓయూలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై నెలరోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వ పెద్దలకు చీమ కుట్టినట్టు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఏఎస్ ప్రమోషన్లు అధ్యాపకుల హక్కు అని, అవి ఎవరి దయాదాక్షిణ్యాల ఆధారంగా పొందేవి కావని మండిపడ్డారు. 48 మంది అధ్యాపకుల విషయంలో ఇంటర్వ్యూ సరిగా చేయలేదని కుంటి సాకులు చెబుతున్నారని దుయ్యబట్టారు. రిజెక్ట్ చేసిన వారిలో అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఓయూ వీసీకి, ప్రభుత్వంలోని మంత్రులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి స్పందనా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఔటా ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు గంగాధర్, డా.రమేష్, డా. రమేష్ బాబు, డా.వెంకటేశ్వర రావు, డాఅరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్‌పై విష ప్రచారాలు తగదు : టీఎస్ఏ



నినాదాలు చేస్తున్న ఓయూ బీసీ జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల బరిలో ఉన్న నవీన్ యాదవ్‌పై రాజకీయ కుట్రలు పన్నుతూ, అనైతిక విష ప్రచారాలకు పాల్పడుతూ రౌడీ అనే ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ అహంకార కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్(టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఎం.శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో టీఎస్ఏ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల్లో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న నవీన్ యాదవ్‌పై ఎన్ని వ్యక్తిగత, రాజకీయ కుట్రలు, కుతంత్రాలు చేసినా ఆయన గెలుపును ప్రభావితం చేయలేవని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దు యాదవ్, రంజిత్ వర్మ, సురేష్ గౌడ్, కార్తిక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

తార్నాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లో మెరుగైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థే లక్ష్యంగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడాలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రూ. 14 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్‌లో డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాని, అందులో భాగంగానే మర్రిగూడాలో భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, కాలనీవాసులు వంగేటి సంజీవ రెడ్డి, పెద్ది సంజీవ రెడ్డి, బాల్ రెడ్డి, నరేష్, అంజిరెడ్డి, నాయకులు బోదాసు లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నోలో డా.వీరమల్ల శ్రీశైలం విజయం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలోని ఇగ్నో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో తెలంగాణకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వీరమల్ల శ్రీశైలం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా 150 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన ఇగ్నోలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఓయూలో ఏబీవీపీ అధ్యక్షుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. తన స్వగ్రామం వెలిమినేడు (చిట్యాల మండలం, నల్గొండ జిల్లా)లో పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న కంపెనీలను మూసివేయాలంటూ ప్రజా ఉద్యమాలు చేశారు. ఇకపై విద్యా సంస్కరణలు, ఉపాధ్యాయుల సమస్యలు, సమాజాభివృద్ధిపై నిర్మాణాత్మకంగా పనిచేస్తానని తెలిపారు.

ప్రచారానికే హాస్టళ్లు..

అద్దెకు ఉంటున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో వెలుగులు, పూలదండలు, కెమెరా ఫ్లాష్‌ల మధ్య ఆగస్టు 25న కొత్త వసతి గృహాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి విద్యార్థుల సంక్షేమంపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇప్పుడు అవి కేవలం ప్రచారపు హాస్టళ్లగానే ఉన్నాయని విద్యార్థుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది కొత్తగా అడ్మిషన్ విద్యార్థులకు హాస్టల్ కేటాయించకపోవడంతో చాలా మంది బయట గదులు అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

సదుపాయాలు కరువు

సీపీజెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి పీజీ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అక్టోబర్ 13 నుంచే తరగతులు ప్రారంభమైనా ఇప్పటికీ హాస్టల్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త హాస్టళ్లు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా బెడ్లు, ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు, మెస్ సదుపాయాలు కల్పించలేదు. దీంతో చాలా మంది విద్యార్థులు బయట గదులు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. కేవలం ఫొటోకే హాస్టల్ ప్రారంభించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆగస్టు 25న వసతి గృహం ప్రారంభానికి వచ్చిన సీఎం

యూనివర్సిటీకి అప్రతిష్ట

ఇప్పటికీ విద్యార్థులకు గదులు కేటాయించకపోవడం యూనివర్సిటీకే అప్రతిష్ట. కొత్త భవనాలు కట్టడమే కాదు, వాటిని వసతి గృహాలుగా మార్చి సదుపాయాలు కల్పించాలి. పీజీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలి.

- కె.శివశంకర్, ఏబీవీపీ ఓయూ కార్యదర్శి



గోల్ఫ్ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధులు

గోల్ఫ్‌కు ఆదరణ పెరుగుతోంది : జీఐఏ చైర్మన్ అనిరుధ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశంలో గోల్ఫ్‌కు ఆదరణ బాగా పెరుగుతోందని గోల్ఫ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (జీఐఏ) చైర్మన్ అనిరుధ్ అన్నారు. కంట్రీ క్లబ్‌లో జరిగిన గోల్ఫ్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో దేశంలోని మెట్రో నగరాలకే పరిమితంగా ఉండే గోల్ఫ్ ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించిందని, సామాన్యులు కూడా గోల్ఫ్‌పై ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. గోల్ఫ్ సంబంధిత క్రీడా వాణిజ్యం కూడా దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఐఏ సభ్యులు ధీరేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.